అక్షర విజేత
Email: vijethatelugudaily@gmail.com
రిపోర్టర్స్ కావలెను
బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885

తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక

B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231
తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com
కావలెను
విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించుటకు: 7702866885, 9059324231

ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :106 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ సోమవారం 09 ఫిబ్రవరి 2026

## దేవరపల్లి హాస్టల్‌లో 92 మంది విద్యార్థులకు అస్వస్థత..

# సీఎం సీరియస్

- దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

**అయోధ్య లడ్డూలకు ప్రత్యేక నెయ్యి వాడటమే కల్తీకి నిదర్శనం**

**మఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలి**



తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం.

# "నామ్ నరేందర్... కామ్ సరెండర్"...

## ప్రధాని మోదీపై షర్మిల విమర్శనాస్త్రాలు

- అమెరికాతో ప్రధాని మోదీ ఒప్పందంపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు
- ఇది గ్రేట్ డీల్ కాదు, దేశానికి బ్లాక్ డీల్ అని వ్యాఖ్య
- అమెరికా బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ
- సున్నా సుంకాలతో స్వదేశీ పరిశ్రమలకు, రైతులకు తీవ్ర నష్టమని ఆందోళన
- ఒప్పందం పూర్తి వివరాలను వెంటనే బయటపెట్టాలని డిమాండ్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక 'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు.

## భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి

- భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం
- మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ
- మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం
- మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ



భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్

చెన్నైలో జరిగిన వివాహ వేడుకలో సందడి

పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్న జగన్, విజయ్

విజయ్ రాజకీయ ప్రవేశం నేపథ్యంలో పెరిగిన ఆసక్తి

'జన నాయకుడితో జన నాయగన్' అంటూ వైరల్ అవుతున్న ఫొటోలు



## ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

-: కేటీఆర్ డిమాండ్

- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్రేనని కేటీఆర్ ఆరోపణ



## నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం



- స్వర్ణాంధ్ర 2047 విజన్, 10 సూత్రాల అమలుపై ప్రధానంగా సమీక్ష
- ఆదాయార్జన శాఖలు, కేంద్ర పథకాల పురోగతిపై చర్చ
- వర్చువల్ విధానంలో పాల్గొననున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

## బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలూ ఒక్కటే

-వేల కోట్లు సంపాదించిన కేసీఆర్ పేదలకు ఇళ్లు కట్టలేదన్న విమర్శ
-కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలన్న డిమాండ్
-జిల్లాల రద్దుపై వస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టీకరణ



# బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలూ ఒక్కటే

గత బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రజలను బ్లాక్‌మెయిల్ చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ అంటే 'బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి' అని అభివర్ణించిన ఆయన, ఫోన్ ట్యాపింగ్‌తో వందల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,500 కోట్లు అక్రమ మార్గాల్లో సంపాదించినవేనని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ములుగు జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.పదేళ్ల పాలనలో అధికారాన్ని దుర్వినియోగం చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమ సంపదను కూడబెట్టారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి, వారి ఆస్తులను బలవంతంగా బదిలీ చేయించుకున్నారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సినీ తారలనే కాకుండా చివరికి భార్యాభర్తల మధ్య సంభాషణలను కూడా విన్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కాళేశ్వరం, ఫార్ములా-ఈ రేస్ కుంభకోణాలపై సీబీఐ విచారణకు ఆదేశించకపోవడంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి 'కిషన్ రావు'గా మారి కేసీఆర్‌కు దత్తపుత్రుడిగా మారారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై సీబీఐ, ఈడీ కేసులు పెట్టిన కేంద్రం, కాళేశ్వరం స్కామ్‌పై విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను కిషన్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకే నాణేనికి రెండు ముఖాలని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని అన్నారు.కేసీఆర్ కుటుంబం టీవీ ఛానెళ్లు, వార్తాపత్రికలతో వేల కోట్ల వ్యాపారాలు సంపాదించింది కానీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టివ్వలేదని రేవంత్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని, రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తున్నామని తెలిపారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారనేది అవాస్తవమని స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చించకుండా, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏ జిల్లాను రద్దు చేసేది లేదని హామీ ఇచ్చారు.

# ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో (ఎఫ్ఎస్ఎల్) శనివారం జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఓటుకు నోటు' కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్ర పన్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత ఘటనే అని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఆదివారం నాడు హనుమకొండలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఓటుకు నోటు' కేసు తుది తీర్పు దశకు చేరుకున్న సమయంలో, సాక్ష్యాలను శాశ్వతంగా నాశనం చేయాలనే దురుద్దేశంతోనే ఈ ప్రమాదాన్ని సృష్టించారని అన్నారు. అత్యంత భద్రత ఉండే ల్యాబ్‌లో, అదీ శీతాకాలంలో మంటలు చెలరేగడం, 24 గంటలూ సిబ్బంది ఉండాల్సిన చోట ఎవరూ లేకపోవడం వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

"ప్రారంభంలో స్వల్ప నష్టమే జరిగిందని అధికారులు చెప్పారు. కానీ ఆ తర్వాత 2015 నుంచి పదేళ్ల విలువైన సాక్ష్యాధారాలు పూర్తిగా కాలిపోయాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం కుట్ర అనే అనుమానాన్ని బలపరుస్తోంది" అని కేటీఆర్ వివరించారు. కేవలం ఒక అంతస్తుకు పరిమితమైన మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటలకు పైగా సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనలో దాదాపు 50 కంప్యూటర్లు, సర్వర్లు, డిజిటల్ రికార్డులు కాలిపోయాయని ఆరోపించారు. ఈ ప్రమాదంలో వేలాది తీవ్రమైన క్రిమినల్ కేసులకు సంబంధించిన ఆధారాలు కూడా ధ్వంసమయ్యాయని, ఇది ప్రజా భద్రతకు పెను ముప్పు అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దల అండతోనే ముఖ్యమంత్రి ఇదంతా చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, వారు సీఎంకు ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారని విమర్శించారు. ఘటనపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, అఖిలపక్ష బృందాన్ని ఎఫ్ఎస్ఎల్ ప్రాంగణాన్ని సందర్శించేందుకు అనుమతించాలని కోరారు

# నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు.

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# వైభవంగా భూశాంతి మహాయజ్ఞం

విజేత (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం అలంపురంలో శ్రీ వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాదు గో అశ్వగజ సహిత చతుర్వేద పూర్వక భూశాంతి మహా యజ్ఞాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్ కొలనువాడ కృష్ణరాజు నిర్వహించిన ఈ మహాయజ్ఞం ఉదయం వేదఘోషల మధ్య ప్రారంభమై సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో కొనసాగింది.

ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ శ్రీ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యజ్ఞశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వాదం పొందారు. గ్రామంలో శాంతి, ఐక్యత, సౌభాగ్యాలు నెలకొని ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన



ఆకాంక్షించారు.

వేద పండితులు చతుర్వేద పఠనంతో పాటు హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. యజ్ఞంలో భాగంగా గోపూజ, అశ్వపూజ వంటి వైదిక క్రతువులు నిర్వహించడం విశేషం. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కిలపర్తి వెంకట్రావు, రాష్ట్ర టైలర్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి,



టిడిపి పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్నివిసు కృష్ణమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి రాంప్రసాద్ చౌదరి, పారిచర్ల ప్రసాద్, పుట్ట దివాకర్, అంజూరి శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, ముప్పిడి రమేష్, తిరుమలరావు గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ మహాయజ్ఞం గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించి సామరస్య వాతావరణాన్ని నెలకొల్పిందని గ్రామస్థులు తెలిపారు.

# శ్రీ మఠం లో సువర్ణ పల్లకి సేవ

## -తుంగా తీరం భక్త జన సంద్రం.

విజేత మంత్రాలయం:

పవిత్ర తుంగభద్ర నది తీరాన వెలసిన సుప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో ఆదివారం శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనం అర్చకులు జయతీర్థ స్వామి, వేదవ్యాస స్వామి,సహాయ పీఆర్వో హొన్నళ్ళి వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో మృత్తికా బృందావనాన్ని బంగారు పల్లకి లో ఉంచి అశేష జనవాహిని నడుమ, భాజా భజంత్రీల నడుమ, మంగళ వాయిద్యాల నడుమ, నమో రాఘవేంద్ర నామస్మరణతో శ్రీ మఠం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ఘనంగా ఊరేగించారు. ప్రవచన మండపంలో బంగారు పల్లకి సేవ చేయించిన భక్తుల పేరు,గోత్ర నామాల పై సంకల్ప పూజలు నిర్వహించారు.సేవ చేయించిన భక్తులకు విశేష దర్శన భాగ్యం కల్పించారు.వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామీజి వారు శేష వస్త్రం, పుష్ప,ఫల, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, సహాయ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి స్వామి,శ్రీ మఠం సెక్యూరిటీ ఇంచార్జ్ రమేష్ స్వామి, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు."అయోధ్యకు పంపిన లడ్డూల కోసం 'ప్రత్యేక నెయ్యి' వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం" అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు.ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు.ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

# "నామ్ నరేందర్... కామ్ సరెండర్"...

"మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు.అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు. 75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి

మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు.మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు

# చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్



రాజకీయ, సినీ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఒకే వేడుకలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్, నటుడు-రాజకీయ నేత 'దళపతి' విజయ్ ఆదివారం చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఇద్దరు అగ్రనేతలతో కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.వైసీపీ అధినేత జగన్ బంధువు వై.ఎస్. సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ రెడ్డి వివాహం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగన్, విజయ్ పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవలే 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, 'జన నాయగన్' అనే తన సినిమా సెన్సార్ వివాదాలతో వార్తల్లో నిలిచారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో జగన్, స్టాలిన్ వంటి ప్రముఖ నేతలతో విజయ్ కనిపించడం తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ వివాహ వేడుకకు నటులు సూర్య, కార్తి కూడా హాజరయ్యారు.



విజేత

సోమవారం 09 ఫిబ్రవరి 2026

# హిందువులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విజేత,(తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: ప్రతి హిందువు హిందూధర్మ పరిరక్షణ కోసం ఆత్మ పరిశీలన చేసుకోవాలని శాసనసభ్యు లు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఒక పథకం ప్రకారం జరుగుతున్న హిందూ ధర్మ వ్యతిరేక ప్రచారాన్ని ప్రతి హిందువు అడ్డుకోవాలని సూచించారు. పెంటపాడు మండలం అలంపురంలో శ్రీ వెంకటరమణ చారిటబుల్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు కొలనువాడ పెద్ద కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భూశాంతి మహా యజ్ఞంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో హిందూధర్మ వ్యతిరేక ప్రచారం తీవ్రంగా జరుగుతోందని హిందూ ధర్మాన్ని నాశనం చేయాలనే కుట్రలను అడ్డుకోవాలని అన్నారు. 2040 నాటికి దేశంలో హిందువులు రెండో స్థానానికి చేరే పరిస్థితి ఏర్పడిందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ విషయం గురించి ప్రతి హిందువు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆయన కోరారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, హిందూ ధర్మానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తానని అన్నారు. ఒక బస్సు డ్రైవర్ కొడుకుగా సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేనయ్యానని తెలిపారు. ఇది హిందూ ధర్మాన్ని అనుసరించటం వల్లే సాధ్యం మైందని ఎమ్మెల్యే సాక్ష్యం చెప్పారు. హిందూ ధర్మాన్ని అనుసరించడం వల్ల చేకూరిన ఫలితాలను గురించి సాక్ష్యం చెప్పాలని అది ప్రతి హిందువు బాధ్యతగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలంపురంలో కొలనువాడ పెద్ద కృష్ణంరాజు చేస్తున్న ఈ సేవా యజ్ఞంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెద్ద కృష్ణంరాజు సేవలు అసాధారణమైనవని ఆయన మన నియోజకవర్గంలో ఉండటం గర్వకారణమని అన్నారు. సుమారు 50 కోట్ల రూపాయల వ్యయం తో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించే విధంగా ఆసుపత్రి నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. ఈ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం,వృద్ధులు, ఆనాథల సేవ, అన్నదానం తదితర నిర్మాణాలు చేపట్టిన శ్రీ వెంకటరమణ సేవా ట్రస్ట్ వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హిందూ పండుగలను ఘనంగా నిర్వహించాలని కోరారు. తాడేపల్లిగూడెంలో ఈ సంవత్సరం మూడు సంక్రాంతి పండుగలు జరుగుతాయని న్నారు. జనవరిలో సంక్రాంతి, ఫిబ్రవరిలో అలంపురంలో పెద కృష్ణంరాజు మహా



యజ్ఞం, మార్చిలో బలుసులమ్మ జాతర జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు,స్వామీజీలు, వేద పండితులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు.

మాజీ శాసనసభ్యులు ముల్లపూడి వెంకట కృష్ణారావు, వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వహకులు గరిమెళ్ళ వెంకటరమణ సిద్ధాంతి, వంక రవీంద్ర, గన్ని వీరాంజనేయులు, పెంటపాడు మండలం జనసేన అధ్యక్షులు పుల్లా బాబి, పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్, రామ లక్ష్మణ్, అలంపురం సొసైటీ అధ్యక్షులు ప్రసాద్, పేటిన గిరిధర్, పసల కొండబాబు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "ఉత్సాహంగా ప్రారంభమైన లీప్ ఉపాధ్యాయుల క్రీడలు"

విజేత, గన్నవరం క్రీడా ప్రతినిధి :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ఆదివారం నాడు ఉత్సాహంగా ప్రారంభించింది. కాగా గుంటూరు జిల్లాలో ఈ పోటీలు పురుషులకు క్రికెట్, మహిళలకు త్రో బాల్ నిర్వహించడం జరిగింది. రాష్ట్రం లోని అన్ని జిల్లాల జట్లు పోటీలకు హాజరు కావడం జరిగింది. ఉపాధ్యాయ క్రీడాకారులకు భోజన వసతులను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భాను మూర్తి రాజు పర్యవేక్షణ లో పోటీలను నిర్వహిస్తున్నారు. పురుషుల క్రికెట్ విభాగం లో ఏ.సి.ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఉదయం తిరుపతి, చిత్తూరు జట్ల మధ్య పోటీ ప్రారంభం కాగా డాక్టర్స్ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో విజయనగరం, అన్నమయ్య జిల్లా జట్లకు, అలాగే కె యల్. యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో యన్. టి.ఆర్ నెల్లూరు జిల్లా జట్లకు కొండమనేని టౌన్ షిప్ లో కాకినాడ మరియు ఏలూరు జిల్లాల జట్లకు పోటీలు జరిగాయి. మహిళా





ఉపాధ్యాయుల త్రోబాల్ డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ లో పశ్చిమ గోదావరి జిల్లా, మన్యం జట్ల మధ్య పోటీ జరుగగా, ఏలూరు జిల్లా మరియు ప్రకాశం జిల్లా,కడప జిల్లా గుంటూరు జిల్లా జట్టు, కృష్ణా జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుతోవిశాఖ జట్టు తిరుపతి జిల్లా జట్టు తో తలపడ్డాయి.కాగా మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో కాకినాడ జట్టు విజయనగరం జట్టు తో ఏ.ఎస్.ఆర్ జట్టు నంద్యాల జట్టు తో సత్య సాయి జట్టు యన్. టి.ఆర్ జిల్లా జట్టు తో శ్రీకాకుళం జట్టు అనంతపురం జిల్లా జట్టు తో కోనసీమ జిల్లా జట్టు చిత్తూరు జిల్లా జట్టు తో తలపడవలసి ఉంది.పురుషుల క్రికెట్ లో విజయనగరం జిల్లా జట్టు అన్నమయ్య జిల్లా జట్టు తో తిరుపతి జట్టు చిత్తూరు తో అనంతపురం జట్టు మన్యం జట్టుతో యన్.టి.ఆర్ జిల్లా జట్టు నెల్లూరు జట్టు తో పోటీ పడవలసి ఉంది. అలాగే గుంటూరు కృష్ణా తో ఏ.యస్ ఆర్,కడప తో పలనాడు బాపట్ల తో పశ్చిమ గోదావరి మన్యం తో ఏలూరు ప్రకాశం తో కడప గుంటూరు తో కృష్ణా తూర్పు గోదావరితో విశాఖ జట్టు తిరుపతి జిల్లా జట్ల తో తలపడాలి, అలాగే కాకినాడ విజయనగరం తో ఏ. యస్.ఆర్ జిల్లా జట్టు నంద్యాల జట్టు తో సత్య సాయి జిల్లా జట్టు యన్.టి.ఆర్ జిల్లా జట్టు తో శ్రీకాకుళం జట్టు అనకాపల్లి తో కోన సీమ జిల్లా జట్టు చిత్తూరు జట్లతో పోటీ పడవలసి ఉంది.

# అట్టహాసంగా మూలాపేట మూలస్థానేశ్వర ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం

నెల్లూరు

ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాల నిర్వహణ జరగాలి: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.శివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంత్రి నారాయణ కీలక ఆదేశాలు.

నెల్లూరు నగరంలోని చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రం మూలాపేట శ్రీ భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన చైర్మన్ పుట్టా అజయ్ కుమార్ రెడ్డి మరియు పదిమంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అనంతరం స్వామివారిని దర్శించుకున్న మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేదికపై మంత్రి నారాయణ మాట్లాడుతూ గతంలోనే తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ కోనేరు అభివృద్ధికి రూ. 6.80 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేసారు.నూతన కమిటీ భక్తులకు సేవ చేయడంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈనెల 15 నుండి ప్రారంభమయ్యే



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని, ఆగమ పండితుల సలహాల మేరకే ఆలయాల్లో పూజా కైంకర్యాలు సాగాలని స్పష్టం చేశారు. సమిష్టి కృషితో ఆలయ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని, నగరం లోని అన్ని దేవాలయాల అభివృద్ధికి మంత్రులుగా తాము పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ,ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు స్థానిక టిడిపి ,జనసేన బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు








# శ్రీశైలంలో ఘనంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

విజేత, శ్రీశైలం :



శ్రీశైలం ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించబడుతున్నాయి. ఆదివారం ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 18 వరకు జరగనున్నాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమ శాస్త్రానుసారం జరిపించబడ్డాయి. ఈ ప్రారంభపూజలలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సంబంధిత అధికారులు, స్థానాచార్యులు అధ్యాపక, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు

# భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు సదుపాయం





విజేత, శ్రీశైలం :

శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటున్నారు. భక్తులు సౌకర్యార్థం వారు దిగినచోటు నుంచి ఆయా ప్రదేశాలు వెళ్ళేందుకు దేవస్థానం ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించింది.ఈ బస్సులు కైలాసద్వారం నుండి శ్రీశైలం వరకు నడపబడుతున్నాయి. అదేవిధంగా నందిగుడి సర్కిల్ నుంచి ప్రారంభమై గణేశసదన్, సెంట్రల్ పార్కింగ్, విభూతిమఠం జంక్షన్, మల్లమ్మకన్నీరు, శివాజీస్ఫూర్తికేంద్రం, రుద్రాపార్కు, సిద్ధరామప్పకొలను, పాతాళగంగరోడ్డు, ప్రైవేటు సత్రాల మీదుగా మరల నందిగుడి సర్కిల్‌కు చేరుకుంటాయి.భక్తులరద్దీని బట్టి ఆదివారం నాలుగు బస్సులు నడపబడుతున్నాయి.అదేవిధంగా ఈ నెల 10 మరియు 11 తేదీలలో రోజుకు ఎనిమిది బస్సులు నడపబడుతాయి.

అలాగే 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రోజుకు 10 బస్సులను నడపడం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి తెలిపారు.

# టిడిపి మైనారిటీ నాయకులు ఇలియాజ్ కుటుంబ సభ్యుల షాదీ ముబారక్ కార్యక్రమానికి మండల టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్

రామసముద్రం పిబ్రవరి 8 విజేత



ఆదివారం కర్ణాటక రాష్ట్రం ములభాగల్ నందు పర్యటిస్తూ ఇలియాజ్ వారి కుటుంబ సభ్యుల షాదీ ముబారక్ మహోత్సవం సందర్భంగా వారి ఆహ్వానం మేరకు హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించిన టిడిపి పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్

ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, కోవా కృష్ణ మూర్తి, ఇంజం వెంకటరమణ, రాం మూర్తి, ఆన్సర్ బాషా, రంగాని వెంకటేష్, సుధాకర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 16 కోట్ల 70 లక్షలతో మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు

నెల్లూరు



ఆలయ నమూనా డిజైన్లను పరిశీలించిన మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ నిర్మాణ పనులపై దేవాదాయశాఖ అధికారులకు పలు సూచనలు చేసిన ఇరువురు మంత్రులు

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచాలని ఆదేశం అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులు .మంత్రులు ఆనం ,నారాయణ మాట్లాడుతుఆరునెలల క్రితం త్రిదండి చినజీయర్ చినజీయర్ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు ప్రధాన ఆలయంతో పాటు ,నరసింహస్వామి ఆలయ ఫౌండేషన్ పూర్తయింది ఆలయానికి నాలుగు వైపులా మాడవీధులు ఏర్పాటు చేస్తాము అనుకున్న సమయానికే శాస్త్రోక్తంగా పనులు పూర్తి చేస్తాము. మరో 18 నెలల్లో ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు కానుకగా ఇస్తాము అన్నారు

# కొండవీడు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో ప్రత్తిపాటి అభినవ అణిపోతారెడ్డిగా నిలిచారు: కందుల దుర్గేశ్

**- కొండవీడు ఉత్సవాల నిర్వహణను ముఖ్యమంత్రికి తెలియచేస్తాను : దుర్గేశ్**

**- ఈ ప్రాంత అభివృద్ధికోసం గతంలో ప్రత్తిపాటి ప్రభుత్వానికి అందజేసిన రూ.110 కోట్ల డీపీఆర్ ను కేంద్రానికి పంపించాం : దుర్గేశ్**

**- తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యి వినియోగాన్ని సుబ్బారెడ్డి, వైసీపీనేతలే అంగీకరించారు : దుర్గేశ్- కొండవీడు అభివృద్ధికి సహకరిస్తామన్న మంత్రి దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు : ప్రత్తిపాటి**

**- కొండవీడు అభివృద్ధి కోసం రూ.110కోట్లతో తయారుచేసిన డీపీఆర్ కు త్వరగా ఆమోదం లభించేలా చూడాలని మంత్రిని కోరుతున్నా: ప్రత్తిపాటి**

**- కోటప్పకొండ ఉత్సవాలనూ జయప్రదం చేయండి : చదలవాడ అరవిందబాబు - ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో కొండవీడు అభివృద్ధి : కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా**

విజేత కొండవీడు

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల కృషి వల్లే రాష్ట్రంలో ఈ 18 నెలల్లో అనేక ఉత్సవాలు నిర్వహించామని, ప్రజల జీవితాల్లో కూడా ఉత్సవ వాతావరణ కనిపిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్ తెలియచేశారు. ఈ తరహా ఉత్సవాలు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతాయన్నారు.

ఆదివారం ఆయన కొండవీడు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరై, కొండపైన..దిగువన ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికాశుక్లా, గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావుతో కలిసి వీక్షించారు. అనంతరం కొండపైన ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగాన్ని వైవీ సుబ్బారెడ్డే అంగీకరించారు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించింది అసలు నెయ్యే కాదని ల్యాబ్ రిపోర్టులు ధృవీకరించాయని, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలోనే ఈ మహాపాపం జరిగిందని దుర్గేశ్ తెలిపారు.

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని సాక్షాత్తూ వైవీ.సుబ్బారెడ్డే అంగీకరించారన్నారు. అదే విధంగా గతంలో అయోధ్యకు పంపిన శ్రీవారి లడ్డూలు విషయాన్ని ప్రస్తావిస్తూ వారే కల్తీ నెయ్యిపై నోరుజారారన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలు వేరే చోట నుంచి తెప్పించామని, వాటితయారీలో కల్తీ జరగలేదని చెప్పడం ద్వారా తిరుమల లడ్డూప్రసాదంలో కల్తీ జరిగినట్టు వారు పరోక్షంగా ఒప్పుకున్నారని దుర్గేశ్ అభిప్రాయపడ్డారు.

వైసీపీ నేతల మాటల్లో పొంతన లేదని, రూ.319లకు నాణ్యమైన ఆవునెయ్యి ఎక్కడి నుంచి లభిస్తుందని ఆయన ప్రశ్నించారు. భోలే బాబా డెయిరీ కేంద్రంగానే ప్రత్యేక శ్రద్ధతో కల్తీనెయ్యి తయారుచేయించారని దుర్గేశ్ స్పష్టంచేశారు.

కొండవీడు ఉత్సవాల నిర్వహణ.. విశిష్టతను ముఖ్యమంత్రికి తెలియచేస్తాను..

ఘనమైన చారిత్రక నేపథ్యమున్న కొండవీడు ప్రాంత ప్రాశస్త్యాన్ని తెలియచేసేలా రెండురోజులు కొండవీడు ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు దుర్గేశ్ తెలిపారు. వర్షపు నీటి నిల్వకోసం కొండపై మూడు చెరువులు నిర్మించడం, అవి నిండిన తర్వాత ఆ నీరు కిందకు వెళ్లేలా చేపట్టిన నిర్మాణ శైలి ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. రాష్ట్రంలోని కళా, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణతో పాటు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లు విశేషంగా కృషి చేస్తున్నారని దుర్గేశ్ కొనియాడారు. రాష్ట్రంలో నిర్వహించే ఉత్సవాలకు ప్రజలు లక్షలాది సంఖ్యలో తరలిరావడానికి కారణం కూటమిప్రభుత్వంపై వారికున్న నమ్మకమే అని ఆయన తెలిపారు. ఏటా కొండవీడు ఉత్సవాలు నిర్వహించే అంశాన్ని ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ ఉత్సవాల క్యాలెండర్ లో వాటికి ప్రాచుర్యం కల్పిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

కొండవీడు ఖ్యాతి విశ్వవ్యాప్తంలో ప్రత్తిపాటి అభినవ అణిపోతారెడ్డిని తలపిస్తున్నారు

చరిత్ర ప్రకారం నాడు రెడ్డిరాజు అణిపోతారెడ్డి కొండవీడుకోట నిర్మాణంతో ఖ్యాతి గడిస్తే, నేడు ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తూ, కొండవీడు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో అభినవ అణిపోతా రెడ్డిగా ప్రత్తిపాటి పుల్లారావు నిలిచారని దుర్గేశ్ కొనియాడారు.

ఆయన సంకల్పం సామాన్యమైంది కాదన్న దుర్గేశ్.. ఈ తరహా ఉత్సవాలు, ప్రజలు మెచ్చేలా మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం ఎంతో శ్రమతో కూడిందన్నారు. ఘాట్ నిర్మాణం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఎవరైతే అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తారో అలాంటి నాయకులే చరిత్రలో, ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని దుర్గేశ్ స్పష్టంచేశారు.

కొండవీడు అభివృద్ధికి ప్రత్తిపాటి రూపొందించిన డీపీఆర్ ను కేంద్రప్రభుత్వానికి పంపాం

కొండవీడు ప్రాంత అభివృద్ధికోసం గతంలోనే మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక డీపీఆర్ తయారు చేశారని, దానిని పర్యాటక శాఖ పరిశీలించి, నిన్ననే కేంద్ర ప్రభుత్వానికి పంపించామని దుర్గేశ్ చెప్పారు. కొండవీడు విశిష్టత దృష్ట్యా, ఆ డీపీఆర్ కు త్వరలోనే ఆమోదం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ 18 నెలల్లో సుమారు రూ.30వేలకోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని, అదేవిధంగా కొండవీడు కోట అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.100 కోట్లు ఇస్తానని గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి ముందుకురావడం నిజంగా చాలా గొప్పవిషయమని దుర్గేశ్ పేర్కొన్నారు.

**కొండవీడు అభివృద్ధికి సహకరిస్తానన్న మంత్రి దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు : ప్రత్తిపాటి పుల్లారావు**

కొండవీడు అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, కొండపై ఉన్న లక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి దేవాలయాల అభివృద్ధి, శివాలయం నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సభాముఖంగా హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు.

నేడు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ మరో శుభవార్త చెప్పారని, కొండవీడు ప్రాంత అభివృద్ధి నిమిత్తం తయారుచేసిన 110 కోట్ల



డీపీఆర్ ను కేంద్రప్రభుత్వానికి పంపినట్టు తెలియచేశారన్నారు. డీపీఆర్ కు త్వరగా ఆమోదం లభించేలా చూడాలని ఈ సందర్భంగా మంత్రికి విజ్ఞప్తిచేస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. కొండవీడు కోట చారిత్రక సంస్కృతిని, వైభవాన్ని కాపాడేందుకు తనవంతు చేయూత ఎల్లప్పుడూ అందిస్తానని దుర్గేశ్ చెప్పారన్నారు.

నిబద్ధత కలిగిన మంత్రి కందుల దుర్గేశ్ అని, ఆయన సహకారంతో త్వరలోనే కొండవీడులో 30 కాటేజెస్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

అటవీశాఖ పరిధిలో కొండవీడు కోట ఉన్నందున, దీని అభివృద్ధికోసం అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఏకకాలంలో సమన్వయంతో పనిచేయాలని ప్రత్తిపాటి కోరారు. కొండవీడును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, అమరావతిలోనే బెస్ట్ టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని గతంలోనే ప్రకటించారన్నారు. కొండపైన అభివృద్ధికి పర్యాటక శాఖ తరుపున తగిన సహయ సహకారాలు అందిస్తామని సభాముఖంగా తెలియచేసిన మంత్రి కందుల దుర్గేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. కోటప్పకొండ తిరునాళ్లను కూడా కనివినీ ఎరుగని విధంగా విజయవంతం చేద్దామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి పిలుపునిచ్చారు.

కోటప్పకొండ ఉత్సవాలనూ జయప్రదం చేయండి : చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండ ఉత్సవాలు 15వ తేదీన నిర్వహిస్తున్నామని, వాటిని కూడాప్రజలు విజయవంతం చేయాలని నరసరావుపేట శాసనసభ్యులు అరవిందబాబు కోరారు. కోటప్పకొండ ఉత్సవాలకు తప్పకుండా రావాలని ఆయన ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ ను సభాముఖంగా ఆహ్వానించారు. త్వరలో జరిగే కోటప్పకొండ ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని, అలానే 30 నుంచి 40వరకు భారీస్థాయిలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తారని అరవిందబాబు తెలిపారు. కొండవీడుచరిత్ర ఘనతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియచేయాలన్నారు.

ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో కొండవీడు అభివృద్ధి : జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

2019 తర్వాత, ఇన్నేళ్లకు మరలా కొండవీడు ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారని, మూడు వారాల్లోనే అన్ని ఏర్పాట్లు చేసి, ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేశామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు.

కొండవీడు కోటపై ఉన్న నిర్మాణాలు వీక్షించడానికే ప్రత్యేకంగా





హెలీ రైడ్ ఏర్పాటు చేశామని, ఉత్సవాల అనంతరం కూడా పర్యాటకులు కొండపై విడిదిచేసే ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు. అందులో భాగంగా తొలుత టెంట్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. కొండవీడుపై పర్యాటకుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని కూడా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. పర్యాటకుల వసతికోసం వచ్చే ఉత్సవాల నాటికి కొండపైన తొలుత 30 గదులు నిర్మించాలని నిర్ణయించినట్టు కలెక్టర్ తెలియచేశారు. రాత్రి పూట ప్రశాంతంగా, ఆహ్లాదంగా గడిపేందుకు కొండవీడు ఎంతో బాగుంటుందని, ఈ ప్రదేశాన్ని భవిష్యత్ లో వెడ్డింగ్ డెస్టినేషన్ గా మార్చే ప్రయత్నాలు ఇప్పటినుంచే ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. నేటి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని తలదన్నేలా కొండవీడు నిర్మాణ శైలి ఉందని, దానియొక్క విశిష్టతను విద్యార్థులు, యువత తప్పకుండా తెలుసుకోవాలని ఆమె సూచించారు.

మంత్రి ..ఎమ్మెల్యేలు.. కలెక్టర్ బోట్ షికారు : పుష్ప, ఫలాకృతులు, శాండ్ ఆర్ట్ పరిశీలన.. నిర్వాహకులకు అభినందనలు

రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, అరవిందబాబు, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా లను అధికార యంత్రాంగం ఘన స్వాగతంతో ఆహ్వానం పలికింది. కొండపైకి వెళ్లిన అనంతరం మంత్రి , ఎమ్మెల్యేలు శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక పుష్ప, ఫలాకృతిని పరిశీలించారు. శాండ్ ఆర్ట్ ను పరిశీలించి నిర్వాహకుల్ని అభినందించారు. అనంతరం ఫుడ్ కోర్టును పరిశీలించి, ఆహారపదార్థాల నాణ్యత ఎలా ఉందని పర్యాటకుల్నిఅడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన మంత్రి, ఎమ్మెల్యేలు వారిని ముద్దుచేసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు కొండపైన చెరువులో ఉల్లాసంగా బోటింగ్ షికారు చేశారు.

---

# చెట్నహాళ్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన మంత్రాలయం ఎస్ఐ. మల్లికార్జున

విజేత మంత్రాలయం:

మంత్రాలయం మండల పరిధిలోని చెట్నహాళ్లి గ్రామంలో మంత్రాలయం సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) మల్లికార్జున . ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించబడింది. పెరుగుతున్న టెక్నాలజీతో పాటుగా సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలను మోసం చేస్తున్న తీరుపై గ్రామస్తులకు ఆయన వివరించారు.సదస్సులోని

అపరిచిత లింకులు: వాట్సాప్ లేదా ఎస్సెమ్మెస్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, అలా చేయడం వల్ల ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఓటిపి (ఙ్కూ) జాగ్రత్తలు: బ్యాంకు అధికారులమని చెబుతూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని, మీ ఙ్కూ, పిన్ నంబర్ లేదా బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు.సైబర్ మోసాలు: తక్కువ ధరకే వస్తువులు ఇస్తామని, లాటరీ తగిలిందని వచ్చే నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.వెంటనే ఫిర్యాదు చేయండి: ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 అనే టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ.. "ప్రజలు అప్రమత్తంగా ఉండటమే సైబర్ నేరాలకు ప్రధాన విరుగుడు. మోసపోయినట్లు గమనిస్తే మొదటి రెండు గంటల (Golden Hour) లోపు ఫిర్యాదు చేస్తే మీ డబ్బును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది," అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



---

# మండల అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో జనసేన కమిటీ సమావేశం

బుచ్చిరెడ్డిపాలెం

ఈరోజు మినగల్లు గ్రామంలో గ్రామ జనసేన కమిటీ సమావేశం, స్థానిక నాయుకులతో ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సమావేశం లో గ్రామంలో జనసేన బలోపేతం చేసెందుకు రాబోయే పార్టీ సభ్యత్వ కార్యక్రమం లో మినగల్లులో గతంలో కంటే ఎక్కువగా సభ్యత్వాలు జరిగేలా చూడాలని అలాగే గ్రామం అభివృధి లో జనసేన పాత్ర ఉండాలని, పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా వుండాలని గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మండల అధ్యక్షులు మాధవ్ తెలిపారు, ఈ కార్యక్రమం లో స్థానిక జనసైనికులు, గోవర్ధన్,నాగరాజు,యశ్వంత్, వెంకయ్య,భార్గవ్ ,వెంకటేష్ , మండల జనసైనికులు పసుపులేటి సురేష్, తుమ్మల ప్రసాద్, బిట్రాసాయి, మనోజ్, పాల్గొన్నారు

